నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 02, 2025 | www.navatelangana.com

నేటి నుండి రంజాన్ నెల ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ముస్లిముల ప్రధాన పండుగ అయిన రంజాన్ నెల ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు కఠోరమైన ఉపవాస దీక్షల్లో ఉంటూ ప్రార్థనలు చేస్తారు. పండగ కోసం మసీదులను నిర్వాహకులు ముస్తాబు చేశారు. నమాజ్‌కు వచ్చే వారికి ఇబ్బందులు కల్గకుండా మసీదు కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఎండలు ప్రారంభమైన నేపథ్యంలో సమాజ్‌కు వచ్చే ఉపవాస దీక్షాపరుల కోసం ప్రత్యేకంగా కూలర్లను కూడా సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే ఉపవాస దీక్షల విరమణకు ఉపయోగించే ఖర్జూర దుకాణాలు ఏర్పాటయ్యాయి. వివిధ రకాల వెరైటీలతో మసీదుల ముందు వాటిని అమ్ముతున్నారు.

డీఐఈఓగా జాదవ్ గణేష్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ బోర్డు అధికారిగా(డీఐఈఓ) జాదవ్ గణేష్ కుమార్‌ను నియమిస్తూ ఇంటర్ బోర్డు ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు డీఐఈఓగా ఉన్న రవీందర్ కుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ గణేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. దీంతో బోర్డు సిబ్బంది తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు.



మనకేదీ..విమానం..!

- ఆదిలాబాద్‌లో సిద్ధంగా ఉన్న అవసరమైన భూమి
- కాగితాల్లోనే నానుతున్న విమానాశ్రయ నిర్మాణం
- పలుమార్లు సర్వేలు చేపట్టినా కనిపించని ప్రయోజనం
- పాలకుల పట్టింపులేమితో లభించని అనుమతులు
- జిల్లావాసులకు కలగానే గాలిమోటారు ప్రయాణం

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో విమానశ్రయ నిర్మాణం కలగానే మారుతోంది. విమానాశ్రయం వస్తుందని ఏండ్ల నుంచి ఈ మాట ప్రజాప్రతినిధులు, అధికారుల నోటి నుంచి వినిపిస్తూనే ఉంది. కానీ విమానాశ్రయ నిర్మాణం జరగడం లేదు..గాలి మోటారు ఎగరడం లేదు. కేవలం జిల్లావాసుల కలలోనే కనిపిస్తోంది. విమానాశ్రయ నిర్మాణానికి అనువైన..అవసరమైన భూమి సిద్ధంగా ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. పాలకుల పట్టింపులేమి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం కారణంగా వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు విమానయోగం కలగానే మారుతోంది. తాజాగా వరంగల్ జిల్లా మామునూరులో విమానశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో అందరి దృష్టి ఆదిలాబాద్‌పై కేంద్రీకృతమవుతోంది. ఇక్కడ కూడా విమానశ్రయం వస్తుందని జిల్లావాసులు అనేక ఆశలు పెట్టుకోగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టినట్లు తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతోను అనుమతుల్లో ఆలస్యం జరుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధితో పాటు అనేక రంగాల్లో వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరుణ చూపించడం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఇక్కడ మౌలిక వసతులు కల్పిస్తామని..పరిశ్రమలు నెలకొల్పుతామని..విమానశ్రయం ఏర్పాటు చేస్తామని పాలకులు చెబుతున్న ప్రసంగాలు..ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమైన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణతో పాటు విమానశ్రయ నిర్మాణం..ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ వంటి వాటి కోసం స్థానిక ప్రజలు అనేక ఏండ్లుగా ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వాల కరుణ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా కేంద్రప్రభుత్వం వరంగల్‌కు విమానాశ్రయం మంజూరుచేయగా..ఆదిలాబాద్ జిల్లాను విస్మరించడం పట్ల జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విమానాశ్రయ నిర్మాణం కోసం అనువైన భూమి 369 ఎకరాలు సిద్ధంగా ఉన్నా కేంద్రం సైతం దృష్టిసారించడం లేదు. ఇక్కడ రక్షణ రంగానికి చెందిన భూమి సిద్ధంగా ఉండటంతో 2013లో ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగింది. రక్షణశాఖ అధికారులు సైతం ఇక్కడకు వచ్చి భూమిని పరిశీలించారు. ఏయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటుచేస్తే త్రివిధ దళాలకు శిక్షణ ఇవ్వడంతో పాటు రక్షణ పరంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదం చేస్తుంది. అప్పట్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు భూ సేకరణ చేపట్టగా ఇక్కడ సిద్ధంగా ఉన్న 369 ఎకరాలతో పాటు ఈ స్టేషన్ ఏర్పాటు కోసం అదనంగా మరో 1500 ఎకరాల వరకు అవసరం ఉంటుందని సూచించగా.. అధికారులు చుట్టు పక్కల ప్రాంతాల్లో సర్వే చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో భూసేకరణకు అవసరమైన ప్రక్రియను సిద్ధం చేశారు. ఏవియేషన్ అధికారులు ఇప్పటికి సుమారు నాలుగు సార్లు జిల్లాకు వచ్చి పరిశీలన చేపట్టారు. ఈ మైదానం చుట్టుపక్కల ఎత్తైన నిర్మాణాలను తొలగించాలని సూచించినట్లు తెలిసింది. కానీ తర్వాత క్రమంలో ఈ ప్రక్రియలో పురోగతి కనిపించకపోవడం పట్ల జిల్లావాసుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.



ఆదిలాబాద్‌లోని విమానాశ్రయ స్థలం

విమానయోగం ఎప్పుడో..?

ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లు ఉన్న చోట్ల వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు విమానాశ్రయాలు తప్పనిసరిగా అవసరం అవుతాయి. ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ సౌకర్యాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ కూడా విమానాశ్రయం వస్తుందని జిల్లావాసులు అనేక ఏండ్లుగా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆరు చోట్ల విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఈ జాబితాలో ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఏర్పాటు చేయాలని ఉంది. ప్రస్తుతం జిల్లావాసులు దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల ద్వారా వెళ్లాలంటే 300కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్ లేదంటే 200కిలో మీటర్ల దూరంలో ఉన్న నాగ్‌పూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఆదిలాబాద్‌లో నిర్మిస్తే వివిధ ప్రాంతాలకు ప్రయాణాలతో పాటు వాణిజ్యపరంగానూ జిల్లావాసులకు కలిసి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాను దత్తత తీసుకోవడంతో విమానాశ్రయం మంజూరవుతుందని స్థానిక ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. మరోపక్క కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఉమ్మడి జిల్లాలో ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలు ఉండటంతో కేంద్రాన్ని ఒప్పించి విమానయోగం కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పనుల ప్రతిపాదనలు మూడు రోజుల్లో అందజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నార్నూర్ బ్లాక్‌కు డెల్టా ర్యాంకింగ్ నిధుల కింద విద్య, అంగన్వాడీ, సమాజ అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి పనుల వివరాల ప్రపోజల్ మూడు రోజుల్లో అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విద్యా, మహిళా శిశుసంక్షేమశాఖ, ట్రైబల్, నీతి అయోగ్ కో ఆర్డినేటర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు, ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు స్థల సేకరణ, అంగన్వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు, ప్లే మెటీరియల్, ఔట్ డోర్ ప్లే మెటీరియల్, న్యూట్రిషన్ గార్డెన్, డిజిటల్ క్లాస్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ తదితర అంశాలపై ప్రపోజల్ అందించడానికి సంబంధిత అధికారులతో వివరంగా చర్చించారు. రెండు, మూడు రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కోసిని గ్రామంలో పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు కూలీ డబ్బులు సక్రమంగా రావడం లేదని, రోజు కూలీ రూ. 200 నుండి రూ. 250 మించి రావడం లేదని, పని ప్రాంతాలలో టెంట్‌లు, మంచినీటి సౌకర్యాలు ఉండడం లేదని కూలీలు ముంజం ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పనిముట్లు ఇవ్వడంతో పని ప్రాంతాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పనిచేసిన వారం రోజుల్లోనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని చేసే గ్రామాలలోనే డబ్బులు చెల్లించకుండా పోస్టల్ సిబ్బంది ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని అన్నారు. కూలీలను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మాదిగ అమరుల దినోత్సవం



నవతెలంగాణ-జైపూర్

భూమండలం ఉన్నంత వరకు మాదిగ అమరవీరుల త్యాగం మరిచిపోరని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగ అమరులను మాదిగ జాతి ఎన్నడూ మరువదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కార్యదర్శి సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్, నాయకులు ఇరిగిరాల మల్లేష్, భీమారం ఎంఎస్పీ మండల నాయకులు గాలిపల్లి సత్యనారాయణ, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి సతీష్, ఎమార్పీఎస్ నాయకులు ప్రశాంత్, రామగిరి రాము, జైపూర్ మండల పరిధి నాయకులు వేల్పుల సంజయ్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలని వినతి



కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని రెండు, 15వ వార్డులలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బాల్క శ్యాంకుమార్ మాట్లాడుతూ పట్టణంలో కొన్ని వార్డులకు మిషన్ భగీరథ పైపులైన్‌లే వేయలేదని, దీనితో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా పైపులైన్ లీకేజీలు అధికంగా ఉన్నట్లు తెలిపారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

కోర్టు కొచ్చే వారు డిస్పెన్సరీని ఉపయోగించుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేణుకా యారా
- జిల్లా కోర్టు ఆవరణలో డిస్పెన్సరీ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోర్టుకు వచ్చే నేరస్తులతో పాటు కక్షిదారులు, సిబ్బందికి ఆరోగ్య సమస్యలు తలెత్తే సమయంలో డిస్పెన్సరీ ఉపయోగపడుతుందని హైకోర్టు జడ్జి జస్టిస్ రేణుకా యారా అన్నారు. శనివారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని ఆమె ప్రారంభించారు. ముందుగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. డిస్పెన్సరీలో అందుబాటులో ఉండే వైద్యులు, అందించే సేవలు, సిబ్బంది వివరాలను కలెక్టర్ రజార్షి షా హైకోర్టు జడ్జికి వివరించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్, న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేష్, ఎస్పీ గౌస్ ఆలం, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డిప్యూటి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన, పీపీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

న్యాయమూర్తుల పోస్టుల ఖాళీల భర్తీకి కృషి

జిల్లాలో న్యాయమూర్తుల పోస్టుల ఖాళీల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని న్యాయవాదులు తన దృష్టికి తీసుకొచ్చారని, భర్తీకి తన వంతుగా కృషి చేస్తానని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మిస్ట్రేటివ్ జడ్జి రేణుకా యార అన్నారు. జిల్లాకు వచ్చిన ఆమెను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లాలోని కోర్టుల్లో న్యాయమూర్తుల ఖాళీలు ఇబ్బంది పెడుతున్నాయని, కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని న్యాయవాదులు చెబుతున్నారన్నారు. ఈ విషయం తన దృష్టిలో ఉందని తెలిపారు. ఇన్చార్జి బాధ్యతలు ఇతర న్యాయమూర్తిపై అధిక భారం మోపుతుందన్నారు. ఏ సమయంలో ఎక్కడ ఉండలో వారికి ఇబ్బందులు తెస్తుందన్నారు. ఈ విషయమై తన వంతుగా పూర్తి కృషి చేస్తానన్నారు. అదే విధంగా కోర్టుల్లో మౌళిక వసతులు, ఇతర కార్యక్రమాలను చేపట్టేందుకు కూడా సహకారం అందిస్తానని తెలిపారు.



న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

జీవశాస్త్ర ఉపాధ్యాయునికి ఆర్‌ఐఈలో శిక్షణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని భట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బి.శాంతికుమార్ మైసూర్‌లోని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ)లో శిక్షణకు ఎంపిక కాగా ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకున్నాడు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర భౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు గత నెల 24 నుండి 28 వరకు ఐదు రోజుల పాటు ఆర్ఐఈలో శిక్షణ ఇచ్చారు. ఇందులో 9, 10వ తరగతులకు సంబంధించిన ప్రయోగాలు, కృత్యాలు విద్యార్థులకు సులభతరంగా నేర్పించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చారు. దీనికి తెలంగాణ రాష్ట్రం నుండి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా ఇందులో కాగజ్‌నగర్ మండలం నుండి బి శాంతికుమార్ ఎంపికై శిక్షణ పూర్తి చేసుకోవడం గమనార్హం. ఈ శిక్షణలో శాంతికుమార్ ఎక్కువ ప్రయోగాలను నిర్వహించి ప్రదర్శించారు. కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ తమిల్‌సెల్వం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీకాంత్‌తో పాటు భౌతిక, జీవ, రసాయనిక శాస్త్ర ప్రొఫెసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైన్స్‌తో సర్వం సాధ్యం



నవతెలంగాణ-ఇచ్చోడ

భూమి, ఆకాశంలో ఎలాంటి అద్భుతాలు జరగాలన్నా సైన్సుతోనే సాధ్యమని విద్యాలయం స్కూల్ కరస్పాండెంట్ శ్యాంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యాలయం స్కూల్లో జాతీయ సైన్స్ డే సందర్భంగా సైన్సు ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను, దానివల్ల ప్రజలు మోసపోతున్న తీరును, దాని వెనకాల ఉన్న సైన్సును వీక్షకులకు కళ్లకు కట్టినట్టు విద్యార్థులు మ్యాజిక్ ప్రదర్శన ద్వారా చేసి చూపించారు. ప్రజల్లో అపోహలను తొలగించడం అభినందనీయమన్నారు. ఓ సాధారణ రైతు విత్తనం నాటిన నుండి పంట పండించి మార్కెట్లో అమ్మే వరకు పడే కష్టాలను ప్రదర్శనల రూపంలో చూపించిన విద్యార్థుల ఉండడం పాఠశాలకు గౌరవంగా ఉందన్నారు. చిన్నతనం నుంచే సైన్సు పట్ల ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రమోద్, డైరెక్టర్ సుభాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో ఆటల పోటీలు

నస్పూర్ : మార్చ్ 8 న అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్, నస్పూర్ కాలనీ మహిళలకు టగ్ ఆప్ వార్, త్రో బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ కాలనీ మహిళలకు మార్చి 5న సీఈఆర్ క్లబ్, ప్రగతి స్టేడియం, నస్పూర్ కాలనీ మహిళలకు 4న మనోరంజన్ సేవా సమితిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగినులకు స్పోర్ట్స్, గేమ్స్ (బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్) జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట గల సెంట్రల్ నర్సరీలో మార్చి 6న, అలాగే ఇదే రోజు బంగ్లాస్ ఏరియా మహిళలకు ఎల్లందు క్లబ్‌లో సాయంత్రం నిర్వహిస్తామన్నారు. స్పోర్ట్స్, గేమ్స్‌లో విజయం సాధించిన మహిళలకు అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా ప్రగతి స్టేడియంలో జీఎం చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

ఈజ్‌గాం జాతర ఆదాయం రూ.21.51 లక్షలు

- హుండీలు లెక్కించిన దేవాదాయ శాఖ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గత నెల 25 నుండి 27 వరకు నిర్వహించిన ఈజ్‌గాం శ్రీ శివమల్లన్న స్వామి జాతర ద్వారా దేవాదాయ శాఖకు రూ.21.51 లక్షల ఆదాయం సమకూరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి బి.రమేష్ సమక్షంలో శనివారం ఆలయం ఆవరణలో హుండీలు లెక్కించారు. జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా దేవాదాయశాఖకు రూ. 5,55,368 రాగా, జాతరకు ముందు వివిధ దుకాణాల కేటాయింపు కోసం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ. 11,01,500, ప్రత్యేక దర్శనం టిక్కెట్‌ల విక్రయం ద్వారా రూ. 4,94,450 ఆదాయం సమకూరింది. మొత్తంగా ఈ జాతర ద్వారా దేవాదాయ శాఖకు రూ. 21,51,318 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్‌గుప్తా తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ మైలారపు మురళీధర్, రాంటెంకి సత్తయ్య, వాసవి సేవాదళ్ సభ్యులు కొలిపాక సత్యనారాయణ, రాచకొండ సురేందర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యదర్శి కంభంపాటి సంతోష్, ఈజ్‌గాం గ్రామస్థులు బోర్కుడె లక్ష్మణ్, ఎల్ నరేందర్, ఎల్ రవీందర్, రతిన్ మండల్, ఆలయ అర్చకులు సంతోష్ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందినవారికి సన్మానం

నవతెలంగాణ-నిర్మల్

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సైలు ఎల్.దేవ్‌రావ్, ఎ.లక్ష్మారెడ్డిలను ఎస్పీ పూలమాల, శాలువా, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి, వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నో రకాల త్యాగాలతో పాటు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. సుమారు



36సంవత్సరాల పాటు సర్వీస్ పూర్తి చేసిన ఏఎస్సైలుగా సేవలను అందించారని అన్నారు. వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.ఉపేందర్‌రెడ్డి, ఏఓ ఎండీ.యునుస్ అలీ, ఉద్యోగ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంజయ్ నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. పూర్వ ఏబీవీపీ నాయకులు దివంగత ధర్మేందర్ సింగ్ జ్ఞాపకార్థం ఖాల్సా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఏబీవీపీ విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా ముందుంటుందని ఖాల్సా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సోహన్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో ఖాల్సా ఎడ్యుకేషనల్ కమిటీ మెంబర్ పురుషోత్తం, కేజీబీవీపీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంతోషి రూప, జిల్లా కోకన్వీనర్ నిఖిల్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మేకల మహేష్, ఏబీవీపీ జిల్లా నాయకులు అరుణ్, ఉదయ్, సామాజిక కార్యకర్త అరవింద్ పాల్గొన్నారు.



పథకాలను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు



నవతెలంగాణ-కడెం

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీంలను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన పథకాలను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చేందుకు చేస్తున్న కుట్రలను మానుకోవాలన్నారు. ప్రభుత్వమే నేరుగా సంక్షేమ బోర్డు ద్వారా ఆ పథకాలను అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలని, వలస కార్మికుల కోసం సరైన సౌకర్యాలతో నైట్ షెల్టర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల నమోదుకు రిజిస్ట్రేషన్ చార్జి మాత్రమే వసూలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం రూ.పది లక్షలు ఇవ్వాలని, 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికీ హెల్పర్ బోర్డు ఏర్పాటు చేసి రూ.10,000 ఇవ్వాలని, ప్రమాదాలకు గురైన కార్మికులందరికీ అన్ని ఖర్చులను సంక్షేమ బోర్డు భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఊట్ల కోటయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీంలను ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే పథకాలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ అన్నారు. తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 4న జిల్లా రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయాల ఎదుట నిర్వహించే కార్యక్రమాల కరపత్రాలను శనివారం జిల్లా కార్యాలయం కుమురం భీం భవనంలో ఆవిష్కరించారు. ఈనెల 4న జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించే డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్సింగ్, దేవిదాస్, జిల్లా నాయకులు సుభాష్, లక్ష్మణ్, రాజు, దేవేందర్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారిణి అక్షితకు అభినందనలు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అక్షిత వికారాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా తరఫున పాల్గొని, మంచి ప్రతిభ కనబర్చినందుకు గాను పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు. వికారాబాద్ నుంచి పాఠశాలకు తిరిగి వచ్చిన అక్షితకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాస స్వామి, పాఠశాల పీడీ జి.నాందేవ్, సీనియర్ ఉపాధ్యాయులు బి.గజానన్, వై.రామ్‌రెడ్డి, సుకుమార్ పెట్కులే, ఆర్. సుజాత, సి.శ్రీనివాసరెడ్డి, జి.సంజీవరెడ్డి పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని వాఘాపూర్‌లో శనివారం ఉపాధిహామీ పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రతి కూలికి రూ.12వేల నగదును ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. రైతు కూలీలను దృష్టిలో ఉంచుకొని వలసలను నివారించటానికి డా.మన్మోహన్ సింగ్ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చిందని అన్నారు. కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ ఓబీసీ చైర్మెన్ గోస్కూరి రాజేందర్, మావల మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మర్సకోల గౌతమ్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు మెస్రం ఆనంద్‌రావ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ శాఖకు నూతన జాగిలం టాంగో

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

9నెలల పాటు హైదరాబాద్ మొయినాబాద్‌లో కఠోర శిక్షను పొంది శనివారం ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన నూతన జాగిలం టాంగోను జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం కు సిబ్బంది పరిచయం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అంతర్గత భద్రతలను కీలక పాత్ర పోషించనున్న జాగిలాల బృందానికి అదనపు బలంగా నూతన జాగిలం టాంగో రావడం సంతోషకరమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ జాగిలం లాబ్రడార్ రిట్రీవర్ జాతికి సంబంధించిన జాగిలం, ఈ జాగిలంతో జిల్లాలో ఐదు పేలుడు పదార్థాలను కనుగొనే జాగిలాలు, రెండు నేరస్థులను కనుగొనడంలో ఉపయోగపడే జాగిలాలు, ఒక మత్తు పదార్థాలను కనుగొనే జాగిలం మొత్తం ఎనిమిది జాగిలాల బృందం ఆదిలాబాద్ జిల్లాకు రక్షణ భద్రత విషయంలో వాటి పాత్రను పోషించనున్నాయని తెలిపారు. ఈ జాగిలం ముఖ్యంగా పేలుడు పదార్థాలైనా టీఎన్టీ, ఆర్డీఎక్స్, పీఈకే, సేఫ్టీ ఫ్యూస్, కార్డెక్స్, అమోనియం నైట్రేట్, జిలటిన్ స్టిక్స్, అత్యాధునిక ఆయుధాలైన ఐఈడీలు, బాంబులను కనుగొనడంలో వీటి పనితీరు దిట్ట అనడం లో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది నెలల పాటు శిక్షణను తీసుకొని జిల్లాకు వచ్చిన టాంగో, జాగిలం హాంగులర్ ఎల్ సోమన్నను జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. అదేవిధంగా జిల్లాకు బాంబులను కనుగొనడంలో ఉపయోగించే నూతన పరికరం ఎన్ఎల్‌జేడీను జిల్లాకు కేటాయించడం జరిగిందని, ఈ పరికరాన్ని ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ పరికరం నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్, వీఐపీలు జిల్లాలో పర్యటించిన సందర్భంలో ఈ పరికరము, నూతన జాగిలాలు తమ వంతు పాత్ర పోషిస్తూ, భద్రత కల్పించడంలో కీలకంగా వ్యవహరిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి వెంకటి, బీడీ టీం ఇన్‌చార్జ్, డాగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జ్ పి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టులు



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన జిజ్ఞాస ప్రాజెక్టుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్ నుంచి రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని శనివారం ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ తెలిపారు. తెలుగు విభాగం నుంచి జె.యోగలక్ష్మి మార్గదర్శకత్వంలో ఆదిలాబాద్ జిల్లా తోటీలు జీవన స్థితిగతులు, ఫిజిక్స్ విభాగం నుంచి శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో యుటిలైజేషన్ ఆఫ్ ప్లాస్టిక్ అనే అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక అవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన విద్యార్థులను, మార్గదర్శకులను కళాశాల బృందం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు, డాక్టర్ రాణి, పీడీ అనిత, షేక్ ముజీబ్, పెంటన్న, కపిల్, వినిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-నార్నూర్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శనివారం మండలంలోని భీంపూర్ గ్రామంలో నిర్వహించిన భగవద్గీత పారాయణం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్ మహారాజ్, మాజీ ఏఎంసీ చైర్మెన్ శ్రీరామ్‌నాయక్, బంజారా నాయకులు నారాయణ నాయక్, గులాబ్ మహారాజ్, పవార్ దేవిదాస్, జాదవ్ సంజు నాయక్, గంగారాం నాయక్, జాదవ్ బాలాజీ, శ్యామ్‌రావ్, గ్రామస్తులు ఉన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగం సంస్థలలో నిధుల కొరత లేమిటో తెలియజేయాలన్నారు. మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ విద్యారంగాన్ని బాగు చేయాలంటే 15 శాతం నిధులు కేటాయిస్తామని, అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని చదువుకునే ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఇస్తామని, మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌ని ఏర్పాటు చేస్తామని చెప్పి, వచ్చిన తర్వాత ఇవేమి నెరవేర్చలేదని మండిపడ్డారు. గత సంవత్సరం 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించి, చేతులు దులుపుకున్నారని విమర్శించారు. తద్వారా గత కేసీఆర్ ప్రభుత్వానికి, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మధ్య ఎలాంటి భేదం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విద్యా రంగంలో ఎక్కువ శాతం చదివేది బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన పేద విద్యార్థులే అని, స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులను విద్యకు దూరం చేసినట్టేనని తెలిపారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల పైచిలుకు ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, అదేవిధంగా అసెంబ్లీని .ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజ్, నరేష్, నవీన్, లోకేష్ పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎస్ఎల్‌బీసీ ఘటన స్థలాన్ని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి శనివారం పరిశీలించారు. గత వారం రోజుల కిందట ఎస్ఎల్‌బీసీలో చిక్కుకొని మరణించిన కార్మికుల మృతులపట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించి, ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల మృతికి రాష్ట్ర ప్రభుత్వం కారణమని అన్నారు. ఘటన జరిగిన వారం రోజులు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో ఘటన స్థలాన్ని పరిశీలించకపోవడం ఏంటని ప్రశ్నించారు. మంత్రులు సైతం విహార యాత్రకు వచ్చినట్టు వచ్చి వెళ్ళడం సరికాదన్నారు. ప్రభుత్వం ముందుచూపు లేకుండా అనాలోచితంగా వ్యవహరించడం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల శంకర్, హరీష్‌బాబు, ధన్‌పాల్, సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డితో పాటు రాష్ట్ర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎంఐఎం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఐఎంఐఎం పార్టీ బడుగుబలహీన వర్గాల అభ్యున్నతితో పాటు వారి సంక్షేమానికి పాటుపడుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. శనివారం పార్టీ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బొక్కలగూడలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఎగరవేసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957 మార్చి 1న పార్టీ ఆవిర్భావం అయిందన్నారు. నాటి నేటి వరకు 67 ఏండ్ల నుంచి అనేక ఒడిదొడుకులను ఎదుర్కొని 68వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. కేవలం ముస్లిం కోసం కాకుండా బడుగుబలహీన, పీడిత వర్గాల కోసం ఉద్యమించామని తెలిపారు. నేడి గల్లీ నుంచి ఢిల్లీ వరకు పార్టీని వ్యాప్తి చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహ్మద్ రోహిత్, ఇనాయత్, సిరాజుద్దిన్, షానవాజ్ ఉన్నారు.



నిరుపేద ముస్లిం కుటుంబాలకు సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సరకులను పంపిణీ చేస్తున్నామని సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు సయ్యద్ ముబాషిర్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని టీఎన్జీఓ గార్డెన్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే పేద ముస్లిం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశ్యంతో నిత్యావసర సరకులను అందిస్తున్నామన్నారు. దాతల సహకారంతో సంఘం తరఫున గుర్తించిన పేదలకు వీటిని అందజేశామన్నారు. పవిత్ర మాసంలో ఏ ఒక్క నిరుపేద కుటుంబం ఆహారం కోసం ఇబ్బంది పడవద్దనే తమ సంకల్పానికి దాతలు సహకారం అందించాలని కోరారు. ప్రతి కాలనీలోని మసీదుల నిర్వాహకులకు పేదల ఎంపిక బాధ్యతలు ఇచ్చామన్నారు. వారి ఇచ్చిన వివరాల ప్రకారం ప్రతి కాలనీ నుంచి ఐదుగురుని ఎంపిక చేస్తామని, ఇందులో సంస్థ సభ్యులు ఎవరు కూడా ఉండరని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అమ్మద్ తవక్కల్, ముస్తీ ముస్తాఫా, సఫాబైతుల్ మాల్ ఉపాధ్యక్షుడు హఫీజ్ బసీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి హఫీజ్ ఖాజీం, మంజూర్ అహ్మద్, అబ్దుల్ అజీజ్, నజీర్, మౌలన మంజూర్, అంజద్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో వరుస చోరీలు..

- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. ఒకే వారంలో వైన్ షాప్, భీంనగర్‌లో వెంకటి ఇంట్లో పెళ్లికి దాచుకున్న రూ.7 లక్షలు చోరీకు గురయ్యాయి. అది మరువక ముందే శుక్రవారం రాత్రి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బ్యాంకులో ప్రయివేట్ ఉద్యోగిని ఇంట్లో రూ.73 వేలు చోరీకి గురయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సదరు ఉద్యోగిణి శుక్రవారం నాడు ఇంటికి తాళం వేసి తన స్వంత ఊరికి వెళ్ళింది. ఇది గమనించిన దుండగులు శుక్రవారం రాత్రి ఇంటిపై రేకులను తొలగించి ఇంట్లోకి చొరబట్టారు. ఇంట్లో దాచి పెట్టిన రూ.73 వేలను దొంగలించారు. శనివారం బాధితురాలు ఇంట్లోకి వచ్చి చూడగా డబ్బులు మాయమయ్యాయి. ఇంట్లో దొంగతనం ఇంట్లో చోరీ అయిందని గ్రహించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో వరుస చోరీలు జరుగడంతో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. చోరీల నివారణకు పోలీసులు ప్రత్యేక ప్రణాళికలతో పాటు సాంకేతికతను కూడా వినియోగించనున్నారని తెలిసింది.

హీరాసుక జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 9న హైదరాబాద్‌లో నిర్వహించే గొండిధర్మ గురు హీరాసుక జయంతి వేడుకలను జయప్రదం చేయాలని నేషనల్ పర్దాన్ జన్‌జాతి ఉద్యాన్ సంఘటన్ తెలంగాణ ఇన్‌చార్జి సిడం రాంకిషాన్ కోరారు. శనివారం బస్టాండ్ ఎదుట గల హీరసుక దేవస్థానంలో జయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇటీవల పట్టణంలో పెద్ద ఎత్తున హీరసుక జయంతిని నిర్వహించడంలో ప్రధాన భూమిక పోశించినందుకు గాను సీడం రాంకిషాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాంకిషాన్ మాట్లాడుతూ ఆదివాసీ సమాజంలో ఉన్న పర్దాన్ సమాజానికి గుర్తింపు లేకుండా పోతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తి అయిన తమ తెగకు న్యాయం జరగడం లేదన్నారు. ఐక్యతను చాటేలా నేషనల్ పర్దాన్ జన్ జాతి ఉద్యాన్ సంఘటన్ ఆధ్వర్యంలో ఈనెల 9న హైదరాబాద్‌లో హీరసుక జయంతిని నిర్వహించడం జరగుతుందని తెలిపారు. దీనికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే హాజరు కానున్నారని తెలిపారు. పర్దాన్ సమాజ్ సభ్యులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు వనిత గేడం, కుర్సెంగ యాదవ్ రావ్, కనక విఠల్, ప్రకాష్, గేడం జనార్ధన్ పాల్గొన్నారు.

తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం అధ్యక్షత వహించారు. ఇందులో భాగంగా విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు, రచయిత, చిత్రకారుడు, ఆకాశవాణి



వ్యాఖ్యాత సామల రాజవర్ధన్ తెలుగులో భాషా దోషాలు అనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం బమ్మెర పోతన భాగవతం గజేంద్ర మోక్షం నుంచి కొన్ని పద్యాల గురించి చెప్పారు. అనంతరం రాజవర్ధన్‌ను శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, తెలుగు అధ్యాపకులు రేఖ, నరేశ్, చంద్రకాంత్, కుణాల్, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థుల విహారయాత్ర

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను పీఎం శ్రీ పథకంలో భాగంగా వరంగల్‌కు విహారయాత్రకు తీసుకెళ్లినట్టు ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మళ తెలిపారు. వరంగల్ జిల్లాలో గల రామప్ప, లక్నవరం సరస్సు, భద్రకాళీ దేవస్థానం, వేయ్యి స్తంభాల గుడిని సందర్శించినట్టు తెలిపారు. కాకతీయ శిల్పకళ నైపుణ్యాలను, కాకతీయుల పరిపాలన దక్షతను గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, బడె సాహెబ్, లక్ష్మీ, సంతోష్, భారతి, ధనరాజ్, ఆత్మారాం పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా అంతటా మార్చి 1 నుండి మార్చి 31 వరకు పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదన్నారు. నిషేదిత ఆయుధములు వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించే పబ్లిక్ మీటింగ్లు, జనసమూహం పోగు అవుట వంటివి నిషేధమని, రాళ్ళను జమచేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధమని, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధమన్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఈ నియమ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, మిలిటరీ అధికారులు, హోంగార్డ్స్, అంత్యక్రియ ఊరేగింపులకు అనుమతి అవసరం లేదన్నారు.

పెట్రోల్ బంక్‌లలో కనీస వసతులు కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పెట్రోల్ బంకులలో వినియోగదారులకు కావాల్సిన కనీస వసతులు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. వసతులు లేమి పట్ల జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పెట్రోల్ బంకులలో యజమానులు వినియోగదారులకు కావాల్సిన కనీస వసతులు కల్పించడం లేదన్నారు. కేవలం సంపాదన లక్ష్యంగా ముందుకు సాగుతూ కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. బంకులలో తాగునీటి సౌకర్యంతో పాటు ఎయిర్ ఫీలింగ్ యంత్రాలు, పార్కింగ్ స్థలం లాంటివి ఉండాలని అవి కల్పించని పెట్రోల్ బంక్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు కనీసం బంకులను తనిఖీ చేయడం లేదని ఆరోపించారు. వెంటనే కనీస వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కోరెంగ మాలశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఫలితం ఉంటుందని మాజీ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి శంకరయ్య అన్నారు. శనివారం మండలంలోని చెడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో చదవాలని, కష్టంతో కాదని అలాంటప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. ఉన్నత విద్య చదవడానికి పదో తరగతి పునాది వంటిదన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్ష రాయడంలో మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రాకేష్, సంతోష్, చాంద్‌పాషా, రాజకమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపల్ చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువులో ముందుండాలన్నారు. కళాశాల పేరుతో పాటు తల్లిదండ్రులకు కూడా మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు తొలి ప్రాధాన్యత

ఆసిఫాబాద్: మహిళలు సమస్యలపై నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని మహిళలు, చిన్నపిల్లల రక్షణకు పోలీస్ శాఖ తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, చిన్నపిల్లలకు చట్టాలపై షీ టీం, భరోసా టీం ద్వారా జిల్లాలో అవగాహన సదస్సుల నిర్వహిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా షీ టీం భరోసా సెంటర్ ద్వారా 65 హాట్ స్పాట్ 14 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 2 ఫిర్యాదుల స్వీకరించినట్లు పేర్కొన్నారు. సమస్యలకు సంబంధించి ఆసిఫాబాద్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ షీ టీం నెంబర్ 8712670565, డయల్ 100కు సమాచారం అందించాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి : డీపీఓ

కెరమెరి: నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీలలో మొక్కల పెంపకంపై జాగ్రత్తలు వివరించారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 12 వేల మొక్కలను జూన్ నాటికి సిద్ధంగా ఉంచేందుకు పంచాయతీ అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు మురికి కాలువల పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకంపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆమ్జెట్ పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య పాల్గొన్నారు.



భగీరథా..ఏమిటీ వ్యథా..!

- సిర్పూర్(టి) మండలంలో తాగునీటి ఎద్దడి
- సరిపడా నీళ్లు రాక తిప్పలు పడుతున్న జనం



పని చేయని మిషన్ భగీరథ నల్లా

వేసవికాలం ఆరంభంలోనే తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. ప్రభుత్వం రూ.వేల కోట్లు వెచ్చించి నిర్మించిన భగీరథ పథకం అనేక అవస్థలు ఎదుర్కొంటోంది. తరుచూ పైప్‌లైన్ల లీకేజీలు, ట్యాంకులకు నీళ్లు సక్రమంగా ఎక్కకపోవడం.. సంపుల వద్ద మరమ్మతుల కారణంగా ఈ పథకం తరుచూ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఫలితంగా జనాలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాజాగా సిర్పూటి(టి) మండలంలో జనం తాగునీటి కటకటను ఎదుర్కొంటున్నారు. తాగేందుకు సైతం సరిపడా నీళ్లు లభించక తిప్పలు పడుతున్నారు.

నవతెలంగాణ- సిర్పూర్(టి)

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తాగునీటి ఎద్దడి ఆరంభమైంది. వేసవి ప్రారంభం కావడంతో వాగులు, వంకలు, స్థానిక నీటి వనరులు ఎండిపోయాయి. భూగర్భజలాలు లోతులకు వెళ్లడంతో చేతిపంపులు సైతం పనిచేయని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వివిధ చోట్ల జనం తాగునీటి కోసం తండ్లాట పడుతున్నారు. తాజాగా సిర్పూర్(టి) మండలంలో తాగునీటి జనాన్ని తీవ్ర తిప్పలకు గురిచేస్తోంది. మండలంలో భగీరథ నీరు ఎప్పుడొస్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో మూడు వాటర్ ట్యాంకులు ఉండగా వీటిలోకి నీళ్లు ఎక్కించి కాలనీవాసులకు అందిస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి భగీరథ పైప్ ద్వారా వచ్చే నీటి ప్రవాహం తగ్గిపోవడంతో సమయానికి ట్యాంకులు నిండటం లేదు. ఒక్కో ట్యాంకు నిండటానికి 24గంటల పాటు సమయం పడుతుంది. దీంతో పలు కాలనీల్లో సరిపడా నీళ్లు రావడం లేదు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఎస్టీ కాలనీలో అనేక సార్లు నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యను స్థానిక మాజీ వార్డు సభ్యుడు ఇఫ్రాత్ హుస్సేన్ సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు తూతూ మంత్రంగా పనులు చేయించి విడిచిపెడుతున్నారు. మరోపక్క గ్రామపంచాయతీ పరిధిలోని పెట్ మోహల, వీక్లీ మార్కెట్, బస్టాండ్ ఏరియాలో ప్రతిరోజు 10నిమిషాల కంటే అధికంగా సరఫరా కావం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వేసవికాలంలో తాగునీటి ఎద్దటి తీవ్రతను నివారించాలని జనం కోరుతున్నారు.

మా బాధను పట్టించుకోండి

కన్నెపల్లి నీల, స్థానికురాలు



తాగునీటి సమస్య ఇది వరకే ఉన్నప్పటికీ చలికాలంలో ఏదో విధంగా నెట్టుకుంటూ వచ్చాము. కానీ ఎండాకాలంలో తాగడానికి నీళ్లు లేకపోతే చాలా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుంది. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

తాగునీరు సరఫరా చేయాలి

పూజారి పద్మ, సిర్పూర్(టి)



మా కాలనీలో నీళ్లు ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు బంద్ అవుతాయో తెలియదు. పైపులైను లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. దీనితో సక్రమంగా నీళ్లు సరఫరా కావు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో ఏ విధంగా ఊహించుకుంటేనే భయంగా ఉంది.

తారా స్థాయికి కాంగ్రెస్ గ్రూప్ విభేదాలు

- డీసీసీ అధ్యక్షుడికి..నియోజకవర్గ ఇన్‌చార్జికి పొసగని వైనం
- ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం..?
- అధిష్టానం స్పందిస్తుందా..?



ఓ గార్డెన్‌లో గొడవ పడుతున్న కాంగ్రెస్ నాయకులు(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ అంటేనే గ్రూపులుండడంతో పాటు నాయకులు స్వేచ్ఛగా మాట్లాడుకునే ప్రజాస్వామ్యం ఉంటుందనేది బయట అందరూ అనుకునేది. అయితే దానికి కొనసాగింపుగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నాయకులతో పాటు కార్యకర్తలు కూడా గ్రూపులుగా ఏర్పడడంతో పాటు బహిరంగంగానే ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకోవడంతో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఈ ప్రభావం కనిపించినట్టు తెలుస్తోంది.


తారస్థాయికి చేరిన గ్రూప్ విభేదాలు



కాంగ్రెస్‌లో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్యాంనాయక్ బరిలో నిలిచి ఎన్నికలు పూర్తయిన తర్వాత ఓటమి చెందారు. తన ఓటమికి కారణం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడని బహిరంగంగానే విమర్శించడంతో ప్రారంభమైన గొడవ తారస్థాయికి చేరింది. గత నవంబర్ 2న జరిగిన కులగనలలో ఇరు వర్గాలు దాడులు చేసుకోవడం స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం జరిగింది. తాజాగా శ్యాంనాయక్ చేసిన ఫిర్యాదుతో డీసీసీతో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు కావడంతో ఈ గొడవ చిలికిచిలికి గాలివానల తయారైంది.

డీసీసీకి నియోజకవర్గ ఇన్‌చార్జికి పొసగని వైనం

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అభ్యర్థిగా సరస్వతి కొంత ప్రచారంలోకి వచ్చిన ఎన్నికల సమయంలో శ్యాంనాయక్ అధిష్టానంతో మాట్లాడి టికెట్ తెచ్చుకున్నాడు. దాంతో సరస్వతి కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరడం డీసీసీ అధ్యక్షుడు శ్యాం నాయక్‌కు మద్దతు తెలుపడంతో ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చారు. తర్వాత ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌లో చేరడంతో పాటు శ్యాంనాయక్ ఓటమి కోసం పనిచేశాడని తనకు తెలిపినట్లు శ్యాంనాయక్ బహిరంగంగా విమర్శించారు. అప్పటి నుండి వారిద్దరి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఇద్దరు నాయకులు ప్రత్యేక వర్గాలను తయారు చేసుకున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలపై వ్యతిరేక ప్రభావం

నియోజకవర్గంలో కాంగ్రెస్ మధ్య గ్రూపులు కావడం విభేదాలు తారస్థాయికి చేరడంతో ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలపై దాని ప్రభావం కనిపించినట్లు తెలిసింది. ఓటర్లు కొంత వ్యతిరేకతతో ఇతర పార్టీల వైపు మొగ్గు చూసినట్లు ఓటింగ్ సరళి తెలుపుతుంది.

అధిష్టానం స్పందిస్తుందా..?

జిల్లాలో ఇంత జరుగుతున్న అధిష్టానం కూడా స్పందించకపోవడంతో పార్టీ పరిస్థితి రానున్న రోజుల్లో ఏవిధంగా ఉంటుందోనని సామాన్య కార్యకర్త ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం నియోజకవర్గానికి మంజూరైన నిధులలో కూడా అధిష్టానం డీసీసీ వర్గానికి కొంత నియోజకవర్గ ఇన్‌చార్జికి కొంత వర్గీకరించి ఇవ్వడంతో అధిష్టానం గ్రూపులను ప్రోత్సహిస్తుందని భావన క్షేత్రస్థాయిలో కలుగుతుంది. కాంగ్రెస్‌లో నాయకులకు స్వేచ్ఛ ఎక్కువగా ఉండగా పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించినందుకు తాజాగా తీన్మార్ మల్లన్నను పార్టీ నుండి సస్పెండ్ చేయడం పట్ల నియోజకవర్గ నాయకులు కూడా చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో కూడా పార్టీ పరిస్థితి చక్కదిద్దే విధంగా అధిష్టానం చర్యలు తీసుకోవాలని, లేదంటే పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత నష్టపోయే అవకాశం ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధిష్టానం స్పందిస్తుందో లేదో వేచి చూద్దాం.



రోజ్ గార్డెన్ ఎదుట ధర్నా చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్(ఫైల్)

భద్రత పట్ల బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఏఎస్పీ చిత్తరంజన్



సమావేశంలో పాల్గొన్న పోలీసులు, బ్యాంకర్లు, మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్(ఇన్‌సెట్‌లో)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంకర్లు బ్యాంకుల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆసిఫాబాద్ ఏఎస్పీ, ఎస్డీపీఓ చిత్తరంజన్ అన్నారు. ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లోని బ్యాంకు అధికారులతో శనివారం భద్రతపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పలు ప్రాంతాలలో బ్యాంకులలో జరిగిన దొంగతనాలను ఉద్దేశించి, అలాంటి సంఘటనలు ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో జరగకుండా బ్యాంకు అధికారులు తమతమ బ్యాంకులకు సంబంధించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బ్యాంకుల లోపల, వెలుపల అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ అలారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏటీఎంలలో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, అక్కడ సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా సైబర్ క్రైమ్స్‌పై బ్యాంకుల తరపున కూడా జిల్లా ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐలు రవీందర్, రమేష్, సత్యనారాయణ, ఎస్ఐలు చంద్రశేఖర్, సాగర్, శ్రీకాంత్, విజయ్, ప్రశాంత్, బ్యాంకు కంట్రోలర్స్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

అధికారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-తిర్యాణి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం వెళ్లిన గిరిజనులపై దురుసుగా ప్రవర్తించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకుడు కుర్సింగా శోభన్ డిమాండ్ చేశారు. శనివారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి పనిపై వచ్చిన గిరిజన రైతుల పట్ల కార్యాలయ సిబ్బంది ఒకరు దురుసుగా ప్రవర్తించారని, కార్యాలయానికి తప్పనిసరిగా పాయింట్, షర్టు వేసుకొస్తేనే పనిచేస్తామని, దోతి, షాట్లతో కార్యాలయానికి వస్తే పనిచేయడం కుదరదని, కార్యాలయం నుండి బయటకు పొమ్మని గిరిజనులను అవమానపరచాడని ఆరోపించారు. మండలంలో నివసిస్తున్నది గిరిజనులేనని, గిరిజనులకు దోతి కట్టుకోవడం సాంప్రదాయబద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యాలయంలో ఉన్న అధికారులు గిరిజనులకు కాక ఎవరికి పని చేస్తారని ప్రశ్నించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద బతుకులని, వాళ్లకి పాయింట్, షర్టు కొనుక్కునే స్తోమత లేదని తెలిపారు. కార్యాలయానికి పనిపై వచ్చిన గిరిజనులను అవమానపరిచిన అధికారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజనులు గణపతి, సీతారాం పాల్గొన్నారు.

ఐక్యతగా ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలీలు ఐక్యతగా ముందుకు సాగాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిలభారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహా సభలకు సంబంధించిన కరపత్రాలను సంఘ నాయకులతో కలిసి శనివారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1921లో అఖిల భారత పద్మశాలి సంఘం స్థాపించి ఐక్యతను చాటుతూ దేశంలోనే బలమైన సంఘంగా ముందుకెళ్తుందన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకంలో ఆయన ఆశీస్సులతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో హక్కుల సాధన కోసం ఏకతాటిపై రావాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలలో పద్మశాలీలకు సముచిత స్థానం దక్కేలా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పద్మశాలీలు అత్యధిక తరలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మారిని వెంకటేష్, రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య, గుండా శంకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు లింగయ్య, నాయకులు తిరుపతి, రవీందర్, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీస నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి కోరారు. శనివారం ఎమ్మెల్యే కోవలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండడంతో ప్రయివేట్ విద్యాసంస్థల యజమానులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రానున్న బడ్జెట్‌లో పెండింగులో ఉన్న రూ.8వేల కోట్లపై చిలుకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వెంటనే జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేలా అసెంబ్లీలో విద్యార్థుల పక్షాన మాట్లాడాలని ఎమ్మెల్యేకు కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు లెనిన్, పట్టణ నాయకులు పులి సుశాంత్, అరికిళ్ల తేజ, విలాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ, బెస్తవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కొంద్రే విశాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వేసవికాలం మొదలవకముందే బ్రాహ్మణవాడ, బేస్తవాడలో 15 రోజుల నుంచి మున్సిపాలిటీ నల్లాలు గాని, మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చేతి బోరింగులు పని చేయక తాగునీరు కోసం పెద్దవాగుపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. వెంటనే నీటి సరఫరా అయ్యేలా చూడాలని లేనిపక్షంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాజమ్మ, గౌరుబాయ్, మెంగుబాయ్, సహస్ర, చిరంజీవి, రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | మార్చి 02, 2025 | www.navatelangana.com

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ సంచాలకులు, కార్యదర్శి ఆదేశాల ప్రకారం 2023 సంవత్సరానికి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాలోని ఆశావహులైన ఉపాధ్యాయులు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 20, 2025న జారీ చేయబడిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు ఫారం తగు నిబంధనలు, షరతులతో జతచేయబడిందని, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మొదటి అంతస్తు ఎఫ్-5లో గల మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించి ఉచితంగా దరఖాస్తు ఫారం పొందవచ్చని, ఇతర వివరములకు 8555841417 నెంబర్ సంప్రదించవచ్చని తెలిపారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ అందజేత

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం యువజన నాయకులు గౌరిశెట్టి శ్రీనివాస్ పరీక్ష సామాగ్రి అందజేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆయనను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రమణయ్య, సత్తయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజేందర్, అరవింద్ పాల్గొన్నారు.

అమర వీరుల స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అవునూరి ప్రసాద్
- అంబేద్కర్ విగ్రహం వద్ద ఘన నివాళి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అమర వీరుల స్ఫూర్తితో హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అవునూరి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరుల చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ చేయాలని, అన్ని కులాలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జనాభా ప్రాతిపధికన ఎవరి వాటా వారికి చెందినప్పుడే సమానత్వం వస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో జరగబోయే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, సీనియర్ నాయకులు అవునూరి లచ్చన్న, చిప్పకుర్తి నారాయణ, ముల్కళ్ల రాందాస్, ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు తోటపల్లి మహేందర్, పట్టణ అధ్యక్షుడు కల్లేపల్లి విక్రమ్, ప్రధాన కార్యదర్శి అడ్లూరి శివకుమార్, అల్లంపల్లి రమేష్, ఆకెనపల్లి శిల్పతి, దర్శనాల నవీన్, చాతరాజు రాజశేఖర్ పాల్గొన్నారు.

జన్నారం : ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో జాతి ఉద్యమమంలో ప్రాణత్యాగం చేయడం అనేది చాల గొప్ప విషయం అని వర్గీకరణ కోసం మాదిగలు చేసిన త్యాగం ఎనలేనిదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండకూరి ప్రభుదాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణ కాదేమోనని కలత చెంది ప్రభుత్వాలకు కనువిప్పు కావాలని ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగాలు చేసి అమరవీరులుగ నిలిచిన తెలబండ్ల రవి మాదిగ, సిర్రా నాగేశ్వరరావు మాదిగ, మీరా సాహెబ్ మాదిగ, గింజారపు ప్రభాకర్ మాదిగ, పొన్నాల సురేందర్ మాదిగన, డిమిండ్ల దామోదర్ మాదిగ, ములుగు మహేష్ మాదిగ, దర్శనాల భారతి మాదిగ, పెద్దాడ ప్రకాష్ రావు మాదిగల త్యాగాలు మరువలేనివని అన్నారు. వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జంగం రవి, జిల్లా నాయకులు మామిడి పెళ్లి ఇందయ్య, దూమల్ల రమేష్, మంద రాజేష్, కొండుకురి ప్రశాంత్, దూమల్ల ప్రవీణ్, కుడుకల రాజేందర్, ఈర్నాల గంగన్న పాల్గొన్నారు.

దండేపల్లి : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మరులైన అమరవీరులకు శనివారం మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళ్లు అర్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిజర్వేషన్ సాధనలో భాగంగా అమరులైన మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళి కృష్ణ హాజరై మాట్లాడారు. జాతి కోసం వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా మాదిగ వర్గీకరణ కోసం వారు చేసిన పోరాటం మరువలేనిదని ఈ రోజు వర్గీకరణ దిశగా అడుగులు ముందుకు పడటానికి వారి పోరట ఫలితమేనని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్రత కల్పించినప్పుడే అమరవీరుల ఆత్మకు శాంతి కలుగుతుందని అన్నారు. తెలంగాణలోని 59 ఎస్సీ ఉపకులాలకు సామాజిక న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన నవీన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, జిల్లా నాయకులు నరేష్, కొంగల సత్తయ్య, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని జడ్పీహెచ్ఎస్(బాలుర) పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వేడుకలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పదోతరగతి విద్యార్థులు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలతో వారికి గల అనుబందాన్ని, తీపి గుర్తులను నెమరు వేసుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ సునంద మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాదించి మండలంలో పాఠశాల ముందుండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి ఉపాధ్యాయురాలు వసంత విద్యార్థులు పరీక్షలలో చక్కగా రాయడానికి అవసరమైన మెటీరియల్ ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను, పెన్సిల్, విద్యార్థులకు తన స్వంత ఖర్చులతో కొని అందజేసారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయడానికి సదా అందుబాటులో వుంటామని విద్యార్థులకు భరోసా కల్పించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జన్నారం : మండలంలోని రేండ్లగూడలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. గుట్టు చప్పుడు కాకుండా జియో టవర్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి పట్టుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. పట్టుబడిన వారిలో అల్లం మల్లయ్య, వేయిగండ్ల రవి, వేయి గండ్ల రాజశేఖర్, వేయిగండ్ల లక్ష్మణ్‌లు దొరకగా తిరుపతి, దస్తగిరిలు పరారైనట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన వారి వద్ద సెల్‌ఫోన్లతో పాటు రూ.1600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇంటర్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్యలతో కలిసి ముఖ్య పర్యవేక్షకులు, సంబంధిత అధికారులతో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4 వేల 965 మంది జనరల్, 935 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 5 వేల 625 మంది, 1 వేయి 15 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థినులను తనిఖీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రంలోని మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని, తనిఖీ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రశ్నా పత్రాలు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి అవసరమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని, ప్రశ్నా పత్రాలు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలను బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అయ్యే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ముఖ్య పర్యవేక్షకులు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పవర్‌మేక్ కంపెనీని వెంటనే తొలగించాలి

- హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షులు తిప్పారపు సారయ్య



విలేకరులతో మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మెక్ సంస్థను తొలగించాలని హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇందారం గ్రామంలో హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఈ విషయంలో తగు విధంగా స్పందించాలని కోరారు. గత నాలుగు నెలల క్రితం 75 రోజులు షట్‌డౌన్ చేసిన పవర్‌మేక్ కంపెనీ పనుల నిర్వాహణలో కూడా వైఫల్యం చెందిందని ఆరోపించారు. రోజుకు ఏడువందల మందితో షట్‌డౌన్ పనులు నిర్వహించి ఆపరేషన్, మెయింటనెన్స్ చేయడంలో పవర్‌మేక్ కంపెనీ పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చునని అన్నారు. అనుభవం లేనటువంటి పది మంది హెచ్‌ఓడీలకు రూ.కోట్ల వేతనం చెల్లిస్తూ వారి అవగాహణారాహిత్యంతో పవర్ ప్లాంట్‌కు తీవ్రవమైన నష్టం వాటిల్లుతున్న తీరును యాజమాన్యం గుర్తించాలని కోరారు. అలాంటి పవర్‌మేక్ కంపెనీ వల్ల పని స్థలాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, షట్‌డౌన్ జరిగిన ఆరు నెలలు కాకముందే బాటమ్ యాష్ వినియోగించే రూ.కోట్ల విలువగల డోర్ ఇంక్లూజర్, ఫీడ్ గేట్, పహర్ పరికరాలు ధ్వంసం కావడం జరిగిందని ఆవేధన వ్యక్తం చేశారు. నాసిరకం పనులు అవగాహణ లేని హెచ్‌ఓడీల మెయింటనెన్స్ వల్ల సంస్థకు భారీగా నష్టం జరుగుతుందని వాపోయారు. ఫలితంగా బాటమ్ గెట్స్ కుప్పకూలే భారీ ప్రమాదానికి అవకాశాలు ఉన్నాయని కొంత మంది అధికారులు పవర్‌మేక్ పంఎనీతో కుమ్మక్కై, వారి ఆగడాలను పై అధికారుల దృష్టి పడకుండా జాగ్రత్తపడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సింగరేణి సీఎండీ వెంటనే స్పందించి పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి ఆటంకాలకు, ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలకు కారణమైన పవర్‌మేక్ కంపెనీ ద్వార సంస్థకు జరిగిన నష్టాన్ని రికవరీ చేయాల్సిన అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డితో పాటు పలువురు హెచ్ఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలి

- దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సమావేశంలో మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వేములవాడలో ఈ నెల 10, 11, 12వ తేదీల్లో నిర్వహించే సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు. దళితులకు ఆర్థిక రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కొరకు, కుల వివక్షత కుల నిర్మూలన కొరకు, ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భూమిలేని దళితులందరికీ భూమి కేటాయించాలి. ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఎస్సీ సబ్ ప్లాన్ చట్టబద్ధంగా అమలు చేయాలని, దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధుల దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునేందుకు వేములవాడ వేధిక కానుందని తెలిపారు. రాష్ట్ర సమావేశాలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న సీపీఐ పట్టణ కార్యదర్శి మేదరి దేవవరం, డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి దుర్గం దేవదాస్, జిల్లా నాయకులు మామిడి గోపి, తిరుపతి, శ్రీను, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం

- రామగుండం సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఏడాది పాటు శిక్షణ పొందిన 24వ బ్యాచ్‌కి చెందిన జాగిలాలు రామగుండం పోలీస్ కమీషనరేట్‌కు చేరుకున్నాయి. పాసింగ్ అవుట్ పూర్తి చేసుకున్న మూడు జాగిలాలు నార్కోటిక్ డాగ్ (జెస్సి) గంజాయి మత్తు పదార్థాల గుర్తింపులో స్నిఫర్ డాగ్ (రైడర్) ఎక్స్ ప్లోజివ్ గుర్తింపులో ట్రాకర్ డాగ్ (ట్రెసస్) రామగుండం కమీషనరేట్‌కు తరలించారు. ఈ సంధర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ రకాల నేరాలకు పాల్పడిన నిందితులను గుర్తించడంలో సంవత్సర కాలం శిక్షణ పొందిన ఈ జాగిలాలు కమీషనరేట్‌కు వచ్చినట్లు తెలిపారు. కాగా నేరం జరిగిన చోట పరిసరాల్లో వాసన చూసి నిందితులు, అనుమానితులు, నేరస్థులను త్వరగా గుర్తించడానికి ఈ జాగిలాలను రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో వినియోగించడం జరుగుతుందని అన్నారు. చట్ట విరుద్ద కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి పట్టుకోవడంలో, ఎక్స్‌ప్లోజివ్స్, బాంబ్స్‌ను గుర్తించిన విధంగానే డ్రగ్స్, గంజాయిని ట్రెస్ చేసేందుకు ఈ నార్కోటిక్ స్నిఫర్ డాగ్స్ కీలక పాత్ర ఉంటుందని కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సీసీ హరీష్ పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణాపై ఉక్కు పాదం



నవతెలంగాణ-జన్నారం

దొంగచాటుగా కలప స్మగ్లింకు పాల్పడితే సహించేది లేదని, వారిపై ఉక్కు పాదం మోపుతామని, అలాంటి వ్యక్తులు ఎంతటి వారైనా వదిలేది లేదని జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు స్పష్టం చేశారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా ఇతరులకు అనుమానం రాకుండా కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు సమాచారం ఉంటే తనకు నేరుగా కాని, ఫోన్‌లో కాని సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అడవిని కాపాడుకుంటే మానవుని మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. అదే విధంగా దొంగచాటుగా వాగులు, వంకలు, గోదావరి నుంచి కొందరు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని, అలాంటి వారి ట్రాక్టర్లను ఖచ్చితంగా పట్టుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ అవసరాలకు మా త్రమే ఇసుకను అనుమతించడం జరుగుతుందని, ఆ విషయాన్ని కూడా తమకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి వేళల్లో ఇసుకను ఇతర ప్రాంతాకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం అందితే వారిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అన్నారు. 1967 అటవీ సంరక్షణ చట్టం, అలాగే 1972 వన్య ప్రాణి సంరక్షణ చట్టంప్రకారం ఆంక్షలను అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి 111 శాతం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భగనులు, ఉపరితల గనులలో ఫిబ్రవరి నెలలో 111 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ భూగర్భగనులలో 112 శాతంతో ఆర్కే న్యూటెక్ గని ముందంజలో ఉందని, అలాగే ఉపరితల గనులలో శ్రీరాంపూర్ ఉపరితల గని 146 శాతంతో మొత్తంగా 111శాతం ఉత్పత్తి సాధించిందని తెలిపారు. రానున్న రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని అన్నారు. అలాగే 2025-26 వార్షిక సంవత్సరానికి గాను 65.36 లక్షల టన్నులు శ్రీరాంపూర్ ఏరియాకు నిర్దేశించినట్లు తెలిపారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో సింగరేణి నుండి 40 మంది ఎంప్లాయిస్(రెస్క్యూ టీం) చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించిందని తెలిపారు. అలాగే పారదర్శకంగా క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించి 77 మందికి క్వార్టర్లు అందజేసినట్లు తెలిపారు. ఎస్ఎల్బి ప్రమోషన్లను 65 మందికి ఇవ్వనున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగాల్లో చేరిన ప్రతి ఒక్కరూ నామినీల పేరు నమోదు చేసుకోవాలని, షాప్‌లో అప్లోడ్ చేసుకోవాలన్నారు. ఎఫ్ఎల్ఎం(ఫైల్ లైఫ్ మేనేజ్మెంట్)ను ఇంప్లిమెంటేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏటీఎం ఫైనాన్స్ మురళీధర్ పాల్గొన్నారు.

కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు సాగాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార కొనసాగుతున్న పనుల నిర్వాహణలో పాల్గొంటున్న వారికి రోజు వారి కూలీ గిట్టుబాటు అయ్యేవిధంగా చూడాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ అన్నారు. శనివారం రామారావుపేట్ గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల ప్రహరిగోడ, రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. అదేవిధంగా నర్సరీని సంధర్శించిన ఆయన నూరు శాతం మొలక ఉండే విధంగా జాగ్రత్తపడాలని సూచించారు. కొబ్బరి తోటలో మొక్కల ఎదుగుదల పరిశీలించారు. పశువుల కోసం నిర్మించుకుంటున్న షెడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈఈ, టీఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బైండోవేర్ ఉల్లంఘనకు రూ.లక్ష జరిమానా

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎక్సైజ్ శాఖ గుడుంబా నిర్మూలనలో భాగంగా లక్షెట్టిపేట్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండలం మెదరిపేట గ్రామంలో గోలి రమేష్ బైండోవర్ ఉల్లంఘన కింద దండేపల్లి తహసీల్దార్ ఏ సంధ్యారాణి సదరు వ్యక్తికి రూ.లక్ష జరిమాన విధించారు. ఎక్సైజ్ ఎస్సై జి మౌనికకు నోటీసు అందజేశారు.

ఎస్పీని కలిసిన ఉత్సవ సమితి సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎస్పీ గౌస్ ఆలంను సనాతన హిందూ ఉత్సవ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ పూల బొకేను, స్వీట్స్ అందించారు. అలాగే స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారాం శ్రీనివాస్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి, ఉపాధ్యక్షులు రేణికుంట రవీందర్, కార్యనిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్, సభ్యులు ఉప్పాల కిషన్‌రావు పాల్గొన్నారు.

కంటి బాధితులకు ఆసరా

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కంటి సమస్యలతో బాధపడుతూ ఆపరేషన్ల కోసం నిరీక్షించే వారికి శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆసరాగా నిలిచింది. ప్రతీ మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. ఈ శిబిరంలో కంటి ఆపరేషన్ల కోసం ఎంపికైన 17 మందిని శనివారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. వీరికి సొసైటీ తరపున భోజన, రవాణా సదుపాయం కల్పించారు. తమ సొసైటీ తరపున ఇప్పటికే వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్యాలపై శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద 18 రకాల ట్రేడ్లలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద అందిన దరఖాస్తులలో ఎల్-1 స్థాయిలో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న వాటిని నిబంధనల మేరకు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. యువతకు భవన నిర్మాణ రంగం, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ప్లంబింగ్, మోటార్ సైకిల్ మరమ్మత్తు వంటి వాటిపై శిక్షణ అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, అధికారులు పోటు రవీందర్‌రెడ్డి, ఎ.పురుషోత్తం నాయక్, నీరటి రాజేశ్వరి, మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ వై.రమేష్ పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మొదట రంజాన్ ఉపవాసాల సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం మావల మండలంలోని పలు అభివృద్ధి పనులను జోగు రామన్న పరిశీలించారు. రూ. 20 లక్షలతో మసీదు, రూ.20లక్షలతో మైనార్టీ కబ్రస్తాన్ పనులను మంజూరు చేసుకొని పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. మైనార్టీ సంక్షేమానికి రూ.17 కోట్లను మంజూరు చేసి పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు జోగురామన్నను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మదర్, అమిమ్ బాయ్, ఆసిఫ్ ఖాన్, ఆశీమ్, జమిల్, నాయకులు యూనిష్ అక్బాని, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం)కార్డుకు యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సేర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై కలెక్టర్లు, ఇతర అధికారులతో హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సదరం ధ్రువీకరణ పత్రాల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. వీసీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీఓ విజయలక్ష్మి జిల్లాలోని పరిస్థితులను సీఈఓకు వివరించారు. దివ్యాంగులకు యూడీఐడీ పోర్టల్‌పై అవగాహన కల్పించేల కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలికపై లైంగికదాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆల్ పొలిటికల్ పార్టీ నాయకులు కోరారు. ఈ విషయమై శనివారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంను వేర్వేరుగా కలిసి విన్నవించారు. ఆ బాలిక కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసు నడపాలని నిందితులకు వెంటనే శిక్ష పడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సాజిద్ ఖాన్, ఆయా నాయకులున్నారు.

జీవ వైవిధ్యంలో పక్షుల పాత్ర కీలకం

నవతెలంగాణ-నస్పూర్

పక్షులు జీవ వైవిధ్యంతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి మేలు చేస్తున్నాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.సువర్ణ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మాట్లాడుతూ పర్యావరణంలో పక్షుల ప్రాముఖ్యత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఈ నేపథ్యంలో బర్డ్ ఫెస్టివల్ వర్క్‌షాప్‌లు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎఫ్‌డీఓ సర్వేశ్వర్‌రావు, వరల్డ్ వైల్డ్ లైఫ్ అధికారులు ఫరిదా తంపాల్, బండి రాజేశ్వర్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రముఖులు, అటవీ శాఖ అధికారులు, అటవీ కళాశాల (ములుగు) విద్యార్థులు, జిల్లాలోని పాఠశాలల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్-2020లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో నీటిపారుదల శాఖ ఎఈలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, ఆస్తి పన్ను వసూలు, పారిశుధ్య నిర్వహణ, మొక్కల పరిరక్షణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పనులను వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం పంచాయతీశాఖకు సంబంధించిన డైరీ-2025ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు

- జిల్లా విద్యాధికారి రామారావు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్ల కోసం సీఎస్, డీఓలతో సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, ఎంఈఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను పగడ్బందీగా, పొరపాట్లు లేకుండా మార్గదర్శకాల ప్రకారం



సమావేశానికి హజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది, తాగునీటి సౌకర్యం ఉండాలన్నారు. సెల్ ఫోన్లను సెంటర్లోకి తీసుకెళ్లకూడదని, విద్యార్థులు కూడా ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లను కానీ సెంటర్లోకి తీసుకురావడం నిషేధమన్నారు. పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించ బడతాయని తెలిపారు. ఎటువంటి మాస్ కాపీయింగ్, ప్రశ్నాపత్రాల లీకేజీ జరుగకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ సంవత్సరం 9129 మంది పరీక్షలు రాయనున్నారని, వీరి కోసం 47 సెంటర్లను ఏర్పాటు చేవామని, 47 మంది సీఎస్, డీఓలు, 5గురు కస్టోడియన్‌లు విధుల్లో నియమించామనిప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పద్మ తెలిపారు. సిబ్బంది అందరూ గుర్తింపు కార్డులు ధరించాలని, పరీక్షల వేళ కంటే ముందుగా హాజరు కావాలన్నారు. సమిష్టిగా పనిచేసి పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణ, సమన్వయకర్త ప్రవీణ్ కుమార్, డీసీఈబీ సహాయ కార్యదర్శి భానుమూర్తి, సీఎస్‌లు, డీఓలు, కస్టోడియాన్లు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 132శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో 132శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి ఉత్పాదకత సంక్షేమ కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ఫిబ్రవరి మాసానికి సంబంధించిన ఉత్పత్తి 132 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. 3.10 లక్షల టన్నులకు గాను 4.09 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. సమస్త నిర్దేశించిన లక్ష్యం ఏప్రిల్ 24 నుంచి ఫిబ్రవరి 25 వరకు 33.30 ఫిబ్రవరి వరకు బెల్లంపల్లి ఏరియాలో 32.07 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి 96శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించేందుకు సమిష్టి కృషితో ప్రయత్నం చేస్తామన్నారు. గోలేటి ఓసి ప్రారంభించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. త్వరలో గోలేటి ఓసీతో బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం వస్తుందన్నారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజమల్లు, ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి, మల్లె తిరుపతి పాల్గొన్నారు.



విలేకరులో మాట్లాడుతున్న జీఎం

పరిష్కారం కానీ సమస్యలు

జీఎంలు మారిన సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో జీఎంలు విఫలమవుతున్నారని కార్మికులు వాపోతున్నారు. సింగరేణి క్వార్టర్లు 40 ఏండ్లు కట్టి శిథిలావస్థకు చేరిన కార్మికులు మాత్రం ఆ క్వాటర్లలో నివాసం ఉంటూ ఎప్పుడు కూలుతాయో అంటూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. గోలేటిలో సింగరేణి కార్మికులకు తాగునీటి సమక్ష ఎప్పటి నుండో ఉన్న దీనిని పట్టించుకునే నాధుడే లేడు. జీఎంలు మారిన మంచినీటి సమక్ష తీరడంలో విఫలమవుతున్నారు. ఈ నీరు తాగడం వలన చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు వ్యాధుల బారిన పడుతున్నారు. క్వాటర్ల వెనుక భాగంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రమే ఉంది. కాలనీలలో అంతర్గత రోడ్లు పూర్తిగా చెడిపోయి గుంతలుగా ఏర్పడి వాహనాలకు ఇబ్బందిగా మారుతున్నాయి. సింగరేణి కార్మికులకు నిత్యావసరులకు ఉన్న ఏకైక సూపర్ బజార్ మూసివేయడంతో సింగరేణి కార్మికులు సరుకుల కోసం బెల్లంపల్లి, కాగజ్‌నగర్, రెబ్బెనకు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. సింగరేణి హై స్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ పాడవడంతో హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను బెల్లంపల్లి ఏరియాకు నూతనంగా వచ్చిన జీఎం పరిష్కార మార్గం చూపుతారా..? లేక ఆయన కూడా గత జీఎంల మాదిరిగా చూసిచుడనట్లు వ్యవహరిస్తార అనేది చూడాలి.

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేపు గణేష్



అమరవీరులకు కొవ్వొత్తులు వెలుంగిచి, నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇచ్చోడ

ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరుల త్యాగాలను వెలకట్టలేనిదని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేపు గణేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు కొవ్వొత్తులు వెలుంగిచి, నివాళు లర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గణేష్ మాట్లాడుతూ మాదిగ జాతి భవిష్యత్తుపై ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరుల త్యాగాల వల్లే మాదిగ, మాదిగ ఉపకులలో ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులుగా, రాజకీయంగా, వ్యాపారం రంగంలో స్థిరపడినట్లు తెలిపారు. అమరుల ఆశయ సాధన కోసం మంద కృష్ణ మాదిగ సారథ్యంలో జరిగే ప్రతి పోరుకు మాదిగలు సమసిద్ధమై ఉండాలన్నారు. లక్ష డప్పుల వేల గొంతుల మాదిగల మహా ప్రదర్శనకు మాదిగల సిద్ధమై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు చిట్టి రవి, ఏంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పశువుల శ్రీకాంత్, బేడ బుడగ జంగం మండలాధ్యక్షులు పేర్ల గంగన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు కాశిపాక విష్ణు, మచ్చ గంగారాం, పెంటన్న, అనిల్, మచ్చ అజయ్, రమేష్, కొల్లూరి గంగారాం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మాదిగ జాతి పోరులో అమరులైన తమ త్యాగాలు వృధా కాలేవని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, ఇండ్ల ఎల్లన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగ జాతి అమరవీరుల నివాళుల కార్యక్రమంలో పాల్గొని నివాళ్ళర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా జరిగిన మహోత్తరమైన జాతి హక్కుల ఉద్యమం ఏబీసీడీ దండోరా పోరాటంలో జాతిని ఎస్సీ వర్గీకరణ యుద్ధంలో నుంచి గెలిపించడం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా గాంధీభవన్ తగలబెట్టిన ఘటనలో భగభగ మండే మంటల్లో అమరులు కాలిపోయారన్నారు. అలాగే వివిధ సందర్భాలలో ఉద్యమం మిలిటెంట్ పోరాటం చేస్తున్న క్రమంలో అందులో బలైనటువంటి మరి కొంతమంది అమరులున్నారని పేర్కొన్నారు. తమ అమరత్వం సాక్షిగా తమరు కలలుగన్న జాతి లక్ష్యమైన ఎస్సీల ఏబీసీడీ సాధించుకున్నామన్నారు. కొన్ని వేల సంవత్సరాల, తరాల భవిష్యత్తు కోసం తాము పాటు పడ్డ తమ అమరత్వానికి యావత్ మాదిగ జాతి ఉన్నంతకాలం రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సందూరి వినయ్ సాగర్, ఆరేపల్లి గణేష్, గైక్వాడ్ సూర్యకాంత్ కొల్లూరి సాయన్న, సూర్యకాంత్, టౌన్ నాయకులు కొమ్ము కిరణ్, బాలె సంటేన్న, పద్మంటి సాయి, పుల్లూరి నవీన్ పాల్గొన్నారు.

హరీష్ రావును కలిసిన మాల సంఘం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వర్గీకరణ అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని విన్నవించారు. ఈ అసంబద్ధమైన ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు జరిగిన అన్యాయాన్ని అసెంబ్లీలో పార్టీ పక్షాన ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుండి 2024 రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయబడిన పథకాలు విద్యా, ఉద్యోగం స్వయం ఉపాధి, దళిత బంధు, దళిత బస్తి, రాజకీయ అన్ని రంగాలలో మాలలు, మాల ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణను పునఃసమీక్షించి 2024 జనాభా లెక్కల ప్రకారం మాలలకు న్యాయం జరిగే విధంగా ఎంపారికల్ డాటా సేకరించి రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, రాష్ట్ర కన్వీనర్ బేర దేవన్న, రాష్ట్ర కో కన్వీనర్లు సింగరి అశోక్, పాశం రాఘవేంద్ర, మేదరి స్వామి, గులే సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు మలపతి సుభాష్ పాల్గొన్నారు.

13న ఖైరతాబాద్‌లో ఏఐ బోధన సదస్సు

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల (గర్ల్స్) ఇంగ్లీష్ విభాగం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈనెల 13న ఖైరతాబాద్‌లో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)పై సదస్సు నిర్వహించనున్నారు. కాగా దీనికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా చేతుల మీదుగా ఆమె చాంబర్‌లో విడుదల చేయించారు. కార్యక్రమంలో ఉట్నూర్ తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల (గర్ల్స్) ప్రిన్సిపల్ బానోత్ హరిత, వైస్ ప్రిన్సిపల్ కొరిమి ప్రత్యూష, అధ్యాపకులు బుర్ర మానస, పల్ల హరిక పాల్గొన్నారు.

గాడిద పాలు లీటరు రూ.20 వేలు



నవతెలంగాణ-ఇచ్చోడ

గంగిగోవు పాలు గరిటడైనను చాలు..కడివడైననేమి ఖరము పాలు అనే వేమన పద్యంను తిరగ రాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకంటే గాడిద పాలు మహా ఖరీదైని. లీటరు గాడిద పాలు సుమారు రూ.20 వేలు ఉంటుందని విక్రయదారులు చెపుతున్నారు. పిల్లలకు ఉబ్బసం తగ్గడానికి ఈ పాలు వాడితే నయమవుతుందని కొందరి నమ్మకం. ఐదు మిల్లీ లీటర్లు పాలు రూ.100 నుంచి రూ.150 ధర పలుకుతున్నాయి. కొందరు వీటిని విక్రయిస్తూ జీవన ఉపాధి పొందుతున్నారు. ఇచ్చోడ మండలంలోని పలు వీధుల్లో కొందరు ఉదయమే మైకుతో గాడిద పాలు, గాడిద పాలంటూ చెప్పుకుంటూ వెళ్తున్నారు. దగ్గు, దమ్ము ఉన్న పిల్లలతో పాటు ముందస్తు చర్యలో భాగంగా చిన్న పిల్లలకు గాడిద పాలు కొనుగోలు చేసి తాగి పిట్టిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-నస్పూర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జైపూర్ మండలం శేట్‌పెల్లి గ్రామానికి చెందిన నిమ్మరాజుల సతీష్(32) శనివారం బంధువుల ఇంటికి వెల్లి స్వగ్రామానికి వస్తుండగా, శ్రీరాంపూర్ బస్‌స్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు తీవ్ర గాయలవడంతో వెంటనే మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అతన్ని హైదరాబాద్ తరలించినట్టు సమాచారం.

పార్కింగ్ చేసిన వాహనం చోరీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటి ముందర పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన పట్టణంలో భుక్తాపూర్‌లో చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ వివరాల మేరకు.. జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి పట్టణంలోని భుక్తపుర్ కాలనీలో ఉండే తన బంధువైన బామ్మర్ది జైపాల్ రెడ్డి ఇంటికి శుక్రవారం వచ్చాడు. రాత్రి అక్కడే ఉండగా ద్విచక్ర వాహనం బయట పార్క్ చేశాడు. శనివారం ఉదయం లేచి చూసేసరికి వాహనం కనపడకుండా పోయింది. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏఓ రాజశేఖర్ అన్నారు. శనివారం దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామ రైతు వేదికలో ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులకు ఎలాంటి కొరత లేదన్నారు. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నర్సాపూర్ జి మండలంలోని నసీరాబాద్ గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలపై మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్టిక్ ఆఫీసర్ నైనా రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, శిశువులు క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మేరకు టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ దుర్గాభవాని, వైద్య సిబ్బంది శకుంతల, ఆశావర్కర్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎంబరి సౌమ్య

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

అఖిల భారత కాంగ్రెస్ యువజన విభాగం నిర్మల్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా ఎంబరి సౌమ్యను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం తనవంతుగా ప్రణాళిక రూపొందించుకొని భవిష్యత్తు కార్యాచరణ ఆధారంగా ముందుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఆమెను ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మానవత్వం చాటుకున్న సామాజిక కార్యకర్త

నవతెలంగాణ-ఉట్నూర్

పేదింటి ఆడబిడ్డ వివాహానికి తన వంతుగా సాయం అందించి హనుమాన్ రైస్ డిపో యాజమని జాదవ్ రవి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సాగౌడ్ (మచ్చగౌడ్) కుమార్తె వివాహానికి తనవంతుగా 52 కిలోల బియ్యన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపతి రాజగోడ్, సాధన, సంతోష్ ఉన్నారు.

నూతన జీఎంను కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి నుండి శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వచ్చిన నూతన జీఎం శ్రీనివాస్‌ను ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి ల్యాగల శ్రీనివాస్, ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జింజుపెల్లి నర్సింగ్, బ్రాంచ్ కార్యదర్శి మహేష్, ప్రసాద్, సుధీర్, శ్రావణ్ పాల్గొన్నారు.

